అక్షర దర్బార్
www.aksharadarbar.com
voice of the people
వెల ₹5
శనివారం 22, ఫిబ్రవరి 2025 | సంపుటి :02 | సంచిక :14 | పేజీలు :05

- పోలీసులకు సవాల్ గా మారిన రాజలింగమూర్తి హత్య కేసు
- విచారణలో వెలుగులోకి వస్తున్న అనేక ఆసక్తికర అంశాలు
- టెక్నాలజీ వినియోగించి నిందితుల ఫోన్ కాల్స్ డేటా పరిశీలన
- తద్వారా హత్య కేసులో పాత్రదారులు, సూత్రదారుల గుర్తింపు?
- మలుపులు తిరుగుతున్న రాజలింగమూర్తి హత్య కేసు
- ప్రస్తుతం పోలీసుల అదుపులో ఏడుగురు వ్యక్తులు
- సర్వత్రా ఆసక్తి రేపుతున్న హత్య కేసు విచారణ

వందశాతం లెక్క పక్కా..

- పారదర్శకంగా బీసీ కుల గణన
- బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలో పడొద్దు
- అసెంబ్లీ తీర్మానం చేస్తే నా బాధ్యత పూర్తి
- బీసీ సంఘాల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

4



అసలేమి జరిగింది?

2

జిల్లా కేంద్రమైన భూపాలపల్లిలో జరిగిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసు పలు మలుపులు తిరుగుతుంది. రాజలింగమూర్తి హత్యకు ముందు, ఆ తర్వాత అసలేమి జరిగింది?, ఆయన హత్యకు ప్రధాన కారణం ఏమిటి?, హత్యలో పాల్గొన్నదెవరు?, నిందితుల్లో ఎవరెవరున్నారు?, సూత్రదారులు, పాత్రదారులెవరు? అనేది ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. ప్రధానంగా రాజలింగమూర్తి హత్య కేసు పోలీసులకు కూడా సవాల్ గా మారింది. విచారణలో తీగ లాగితే దుంక కదులుతున్నట్లు తెలుస్తుంది. భూపాలపల్లిలో బస్ స్టేషన్ రోడ్డులోని రెడ్డికాలనీ క్రాస్ వద్ద ఈనెల 19న కొందరు వ్యక్తులు సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తిపై దాడికి పాల్పడటం, ఆయన్ను కత్తులతో పొడిచి హత్య చేయడం, ఈ హత్యపై రాజకీయంగా దుమారం చెలరేగటం, బీఆర్ఎస్, కాంగ్రెస్ పెద్దల పరస్పర ఆరోపణలతో రాజలింగమూర్తి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఆరా తీసిన రాజలింగమూర్తి హత్య కేసు విచారణ ప్రస్తుతం సర్వత్ర ఆసక్తి రేపుతుంది. ఈ కేసు విచారణను పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఇప్పటికే రాజలింగమూర్తి హత్య కేసుకు సంబంధించి ఏడుగురు వ్యక్తులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వీరిలో కొందరు లొంగిపోగా మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విచారణలో అనేక ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలిసింది.

— అక్షరదర్బార్, వరంగల్

2

అంగన్ వాడీల్లో 14,236 పోస్టులు..

- మహిళా శిశు సంక్షేమశాఖలో కొలువుల జాతర
- టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్
- ఆడబిడ్డలకు సర్కార్ శుభవార్త

చేను మేస్తున్న కంచె!

2

- స్వప్రయోజనాలే లక్ష్యంగా కొందరు అటవీ అధికారులు ముందుకు
- అడవులను సంరక్షించడానికి బదులు భక్షిస్తున్న వైనం
- అటవీ భూముల ధారాదత్తానికి పోడుదారులతో పెద్ద మొత్తంలో డీల్
- ఆజంనగర్ ఘటనతో మరోసారి వెలుగులోకి వ్యవహారం
- డీల్స్ పై లోతుగా ఆరా తీస్తున్న ప్రభుత్వ నిఘా విభాగాలు

అటవీ శాఖలో కొందరు అధికారుల పనితీరు కంచె చేను మేస్తున్న చందంగా తయారైంది. అడవులను సంరక్షించడానికి బదులు భక్షిస్తున్నట్లు కనపడుతుంది. తమ స్వప్రయోజనాల కోసం పోడు పేరిట అటవీ భూములను అమ్ముకుంటున్నారని, ఈ క్రమంలో పోడుదారులతో డీల్ కుదుర్చుకుని పెద్ద మొత్తంలో డబ్బు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా ఇలాంటిదే భూపాలపల్లి జిల్లాలో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. అటవీ శాఖలోని ఆజంనగర్ రేంజి పరిధిలో జరిగిన ఘటన తర్వాత అనేక ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలిసింది. ఆజంనగర్ వద్ద పోడు వ్యవసాయానికి సహకరించటంపై రూ.7 లక్షలకు డీల్ కుదురగా గత జూలైలో తొలి విడత రూ.5 లక్షలు ఆజంనగర్ రేంజ్ ఇన్చార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్వో) ఉషకు ఓ మధ్యవర్తి ద్వారా ముట్టజెప్పామని, మిగతా రూ.2 లక్షల కోసం ఆ అధికారి ఉష తమ శాఖలోని ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి తమపై దాడి చేసి కొట్టారని పోడుదారులు ఆరోపించిన విషయం తెలిసిందే.

—అక్షరదర్బార్, హనుమకొండ

ఎస్ఎల్‌బీసీలో 8 మంది గల్లంతు

- సొరంగంలో చిక్కుకున్న కార్మికులు
- శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద భారీ ప్రమాదం
- ఘటనపై ఆరా తీసిన ప్రధాని మోడీ

4

శనివారం
22.02.2025
www.aksharadarbar.com
అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

అంగన్ వాడీల్లో 14,236 పోస్టులు..

- మహిళా శిశు సంక్షేమశాఖలో కొలువుల జాతర
- టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి గ్రీన్‌సిగ్నల్
- ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్
- ఆడబిడ్డలకు సర్కార్ శుభవార్త

అక్షరదర్బార్, హైదరాబాద్: ఆడబిడ్డలకు రేవంత్ సర్కార్ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖలో కొలువుల జాతర మొదలైంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. ఖాళీల భర్తీకి సంబంధించిన ఫైల్‌పై మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు. మొత్తం 6,399 అంగన్వాడీ టీచర్లు, 7837 హెల్పర్ల పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగియగానే మొత్తం 14, 236 పోస్టులతో నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్ ను జారీ చేయనున్నారు. మొత్తం 14,236 పోస్టులను తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేయనుంది. తెలంగాణలో ఈ స్థాయిలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల కొలువులను భర్తీ చేయడం ఇదే తొలిసారి. ఖాళీల భర్తీ ప్రకియతో అంగన్వాడీలు మరింత పటిష్టంగా పని చేయనున్నాయి.

తండ్రిని పొడిచి చంపిన కొడుకు

- పోలీసుల అదుపులో నిందితుడు
- ఆస్తి, కుటుంబ తగాదాలే కారణం..
- మేడ్చల్ జిల్లా కుషాయిగూడలో దారుణం

అక్షరదర్బార్, హైదరాబాద్: ఈనెల 16న మేడ్చల్ జాతీయ రహదారిపై పట్టపగలు అన్నను తమ్ముడు చంపిన ఘటన మరువక ముందే ఇలాంటి ఘటనే మరొకటి చోటుచేసుకుంది. మేడ్చల్ జిల్లా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధి లోని బస్టాప్ వద్ద దారుణం చోటు చేసుకుంది. తండ్రి మొగిలి (50)పై కుమారుడు కత్తితో దాడి చేసి హతమార్చాడు. బస్టాప్ వద్ద ఉన్న తండ్రిపై దాడిచేసి సుమారు 10–15 సార్లు కత్తితో పొడవ డంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బాధితు డిని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను చనిపోయినట్లు డాక్టర్లు ప్రకటించారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. తండ్రి మొగిలి మద్యానికి బానిసై రోజు ఇంట్లో గొడవ చేస్తున్నాడని కుమారుడు సాయి ఈ చర్యకు పాల్పడ్డట్లు తెలుస్తోంది. ఇవే కాకుండా కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల కారణాలు కూడా మొగిలి హత్యకు కారణాలుగా పోలీసులు గుర్తించారు. మృతిచెందిన వ్యక్తిని సికింద్రాబాద్ లాలాపేటకు చెందిన వాడిగా గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. బస్టాప్ వద్ద పట్టపగలే జరిగిన ఈ హత్య స్థానికులను కలవరానికి గురిచేసింది.

అసలేమి జరిగింది?

- పోలీసులకు సవాల్ గా మారిన రాజలింగమూర్తి హత్య కేసు
- విచారణలో వెలుగులోకి వస్తున్న అనేక ఆసక్తికర అంశాలు
- టెక్నాలజీ వినియోగించి నిందితుల ఫోన్ కాల్స్ డేటా పరిశీలన
- తద్వారా హత్య కేసులో పాత్రదారులు, సూత్రదారుల గుర్తింపు?
- మలుపులు తిరుగుతున్న రాజలింగమూర్తి హత్య కేసు
- ప్రస్తుతం పోలీసుల అదుపులో ఏడుగురు వ్యక్తులు
- సర్వత్రా ఆసక్తి రేపుతున్న హత్య కేసు విచారణ

రాజలింగమూర్తి (ఫైల్ ఫోటో)

అక్షరదర్బార్, వరంగల్: జిల్లా కేంద్రమైన భూపాలపల్లిలో జరిగిన సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసు పలు మలుపులు తిరుగుతుంది. రాజలింగ మూర్తి హత్యకు ముందు, ఆ తర్వాత అసలేమి జరిగింది?, ఆయన హత్యకు ప్రధాన కారణం ఏమిటి?, హత్యలో పాల్గొన్నదెవరు?, నిందితుల్లో ఎవరెవరున్నారు?, సూత్ర దారులు, పాత్రదారులెవరు? అనేది ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. ప్రధానంగా రాజలింగమూర్తి హత్య కేసు పోలీసులకు కూడా సవాల్ గా మారింది. విచారణలో తీగ లాగితే దుంక కదులుతున్నట్లు తెలుస్తుంది. భూపాలప ల్లిలో బస్ స్టేషన్ రోడ్డులోని రెడ్డికాలనీ క్రాస్ వద్ద ఈనెల 19న కొందరు వ్యక్తులు సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తిపై దాడికి పాల్పడటం, ఆయన్ను కత్తులతో పొడిచి హత్య చేయడం, ఈ హత్యపై రాజకీయంగా దుమారం చెలరేగటం, బీఆర్ఎస్, కాంగ్రెస్ పెద్దల పరస్పర ఆరోపణలతో రాజలింగమూర్తి హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఆరా తీసిన రాజలింగ మూర్తి హత్య కేసు విచారణ ప్రస్తుతం సర్వత్ర ఆసక్తి రేపుతుంది. ఈ కేసు విచారణను పోలీసులు ప్రతిష్టాత్మ కంగా తీసుకుంటున్నారు. ఇప్పటికే రాజలింగమూర్తి హత్య కేసుకు సంబంధించి ఏడుగురు వ్యక్తులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వీరిలో కొందరు లొంగిపోగా మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకు న్నట్లు సమాచారం. విచారణలో అనేక ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలిసింది.

- విచారణపై సర్వత్రా ఆసక్తి

రాజలింగమూర్తి హత్యపై సంఘటన జరిగిన రోజు నుంచి అనేక ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. తన భర్త హత్యకు బీఆర్ఎస్ కు చెందిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమ ణారెడ్డి కారణమని మృతుడు రాజలింగమూర్తి భార్య హత్య జరిగిన రోజు ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు మీడియాతో మాట్లాడుతూ రాజలింగ మూర్తి హత్యను ఖండించారు. దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని అన్నారు. ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా రాజలింగమూర్తి హత్యపై స్పందిస్తూ ఈ హత్యలో బీఆర్ఎస్ నేతల ప్రమేయంపై అనుమానాలు వెలిబుచ్చారు. ఈ ఆరోపణ లపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రాజలింగమూర్తి హత్యకు తనకు, బీఆర్ఎస్ పార్టీకి గాని ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఒక దశలో రాజలిం గమూర్తి హత్యపై ముఖ్యమంత్రి కూడా ఆరా తీసినట్లు వార్తలు వెలువడ్డాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించిన రాజలింగమూర్తి హత్య కేసు విచారణను పోలీసులు సీరియస్ గా తీసుకుంటున్నారు. హత్యకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి హత్యలో పాత్రదారులు, సూత్రదారులను గుర్తించేందుకు అందుబా టులో ఉన్న టెక్నాలజీని వినియోగించుకుంటున్నారు. ప్రత్యేక బృందాలతో అన్ని కోణాల్లో ఈ హత్య కేసుపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

కాల్ డేటా.. ఫోన్ పేలపై...

రాజలింగమూర్తి హత్యకు సంబంధించి శనివారం వరకు ఏడుగురు వ్యక్తులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వీరిలో హత్యలో పాల్గొన్న వారితో పాటు ఇతరులు కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. అయితే రాజలింగమూర్తి హత్యకు ప్రధాన కారణం ఏమిటి? భూ వివాదమా?, రాజకీయ కోణం ఉందా? అనే అంశంపై పోలీసుల విచారణ సాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో హత్యలో పాల్గొన్నట్లు తాము గుర్తించిన వ్యక్తులతో పాటు ఈ హత్య వెనక ఉన్నారని భావిస్తున్న వ్యక్తుల ఫోన్ల కాల్స్ డేటాను, ఆర్థిక లావాదేవీలను పోలీసులు లోతుగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాజలింగమూర్తి హత్య జరగడానికి ముందు, హత్య జరిగిన తర్వాత అనుమానితుల ఫోన్ కాల్స్ డేటాతో పాటు ఫోన్, గూగుల్ పే ఇతరత్రా జరిగిన ఆర్థిక లావాదేవీల వివరాలను పోలీసులు పరిశీలించి ఇప్పటికే హత్యలో పాల్గొన్న పాత్రదారులతోపాటు సూత్రదారులను కూడా కనుగొన్నట్లు తెలుస్తుంది. పరారీలో ఉన్న వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం. శనివారం ఈ హత్య కేసుకు సంబంధించి ఓ మాజీ ప్రజాప్రతినిధినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇదిలా ఉంటే ఈ హత్య కేసు విచారణలో భాగంగా కొందరు వ్యక్తులు తమ అదుపులో ఉన్నారనే విషయాన్ని, హత్యలో పాత్రదారులు, సూత్రదారులు ఫలాన వ్యక్తులు అనే వివరాలను గాని పోలీసులు ధ్రువీకరించలేదు. కేసు విచారణ గోప్యంగా ఉంచుతున్నారు.

చేను మేస్తున్న కంచె!

- స్వప్రయోజనాలే లక్ష్యంగా కొందరు అటవీ అధికారులు ముందుకు
- అడవులను సంరక్షించడానికి బదులు భక్షిస్తున్న వైనం
- అటవీ భూముల ధారాదత్తానికి పోడుదారులతో పెద్ద మొత్తంలో డీల్
- ఆజంనగర్ ఘటనతో మరోసారి వెలుగులోకి వ్యవహారం
- డీల్స్ పై లోతుగా ఆరా తీస్తున్న ప్రభుత్వ నిఘా విభాగాలు

అక్షరదర్బార్, హనుమకొండ : అటవీ శాఖలో కొందరు అధికారుల పనితీరు కంచె చేను మేస్తున్న చందంగా తయారైంది. అడవులను సంరక్షించడానికి బదులు భక్షిస్తు న్నట్లు కనపడుతుంది. తమ స్వప్రయోజనాల కోసం పోడు పేరిట అటవీ భూములను అమ్ముకుంటున్నారని, ఈ క్రమంలో పోడుదారులతో డీల్ కుదుర్చుకుని పెద్ద మొత్తంలో డబ్బు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా ఇలాంటిదే భూపాలపల్లి జిల్లాలో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. అటవీ శాఖలోని ఆజంనగర్ రేంజి పరిధిలో జరిగిన ఘటన తర్వాత అనేక ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు తెలిసింది. ఆజంనగర్ వద్ద పోడు వ్యవసాయానికి సహకరించటంపై రూ.7 లక్షలకు డీల్ కుదురగా గత జూలైలో తొలి విడత రూ.5 లక్షలు ఆజంనగర్ రేంజ్ ఇన్చార్జి ఫారెస్ట్ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్వో) ఉషకు ఓ మధ్యవర్తి ద్వారా ముట్టజెప్పామని, మిగతా రూ.2 లక్షల కోసం ఆ అధికారి ఉష తమ శాఖలోని ఇతర అధికారులు, సిబ్బందితో కలిసి తమపై దాడి చేసి కొట్టారని పోడుదారులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఆజంనగర్ గ్రామం వద్ద ఈనెల 19న అటవీ శాఖ అధికారులు పోడుదారులపై దాడి చేసి కొట్టడాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అదేరోజు ఖండించారు. దాడికి పాల్పడిన అధికారులపై చర్య తీసుకోవాలని అటవీశాఖ ఉన్నతాధికారులను కోరారు. ఈ ఘటనపై బాధితులు, అటవీ శాఖ అధికా రులు వేరువేరుగా భూపాలపల్లి పోలీసులకు తమ ఫిర్యాదు లను అందజేశారు. దీంతో ఈ అంశంపై తీవ్ర చర్చ జరు గుతుంది.

అక్రమార్జనపైనే గురి!

ఆటవీశాఖలోని కొందరు అధికారులు అక్రమార్జనే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు ఆజంనగర్ ఘటన తర్వాత ప్రచారం జరుగుతుంది. ఆజంనగర్ ఘటనపై పోడుదారులు మీడియాతో మాట్లాడుతూ డీల్ ప్రకారం తాము ఇవ్వాల్సి ఉన్న రూ.2 లక్షల కోసమే అటవీ అధికారి ఉష తమపై దాడికి దిగారని ఆరోపించారు. ఈ విషయంలో ప్రభుత్వ నిఘా విభాగాలు లోతుగా ఆరా తీయగా ఆసక్తికర అంశాలు బయటకు వచ్చినట్లు తెలిసింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి డిప్యూటేషన్ పై హైదరాబాద్ కు వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నారని, ఇక్కడి నుంచి వెళ్లేలోగా డీల్ కంప్లీట్ కోసం ఒత్తిడి తేవడంలో భాగంగానే తాజాగా దాడికి పూనుకున్నారని నిఘా విభాగాల దృష్టికి వచ్చినట్లు సమాచారం. అంతేకాదు సదరు అధికారి ఆజంనగర్ రేంజ్ పరిధిలోని ఓ సెక్షన్ పరిధిలో మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న ఓ గ్రామం వద్ద పోడు పేరిట అటవీ భూములను దారతత్వం చేయడానికి కూడా ఇటీవల డీల్ కుదుర్చుకున్నారని నిఘా విభాగాలు సమాచార సేకరణలో బయటపడినట్లు తెలుస్తుంది. ఇలా మరికొందరు అధికారులు కూడా పోడుదారులతో డీల్ కుదుర్చుకొని అటవీ భూములను ఓపెన్ గా అమ్మకానికి పెడుతున్నట్లు తెలిసింది.

డబ్బా పాలు వికటించి కవలల మృతి

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : డబ్బా పాలు వికటించి ఘనపురం మండలం గొల్లపల్లి గ్రామంలో కవలలు (4 నెలలు) మరణించిన ఘటన శనివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గొల్లపల్లి గ్రామానికి చెందిన మర్రి లాస్యశ్రీ, అశోక్ దంపతులకు రెండో సంతానంలో పాప, బాబు జన్మించారు. తల్లిపాలు పిల్లలకు సరిపోకపోవడంతో డబ్బా పాలు పట్టిస్తూ పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పిల్లలకు రెండుసార్లు డబ్బా పాలు పట్టించి పడుకోబెట్టగా మధ్యాహ్నం వరకు పిల్లల్లో కదలికలేకపోవడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

సబ్ జైలు గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

అక్షర దర్బార్, మహబూబాబాద్: కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సబ్ జైల్ గ్రంథాలయానికి మహనీయుల జీవిత చరిత్ర, వ్యక్తిత్వ వికాసం పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా జైలర్ మల్లెల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు మైస నాగయ్య, ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, గౌరవ సలహాదారులు మైస శ్రీనివాసులు, శంతన్ రామరాజు, మొగిలి శ్రీనివాస్ రెడ్డి, మామిడాల సత్యనారాయణ, షేక్ జానీ, బొడ్డుపల్లి, సోమరాపు వీరస్వామి, బొడ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ భవాని కుంకుమేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లను ఆలయ చైర్మన్ కొలువురి రాజేశ్వరరావు, పరకాల సీఐ క్రాంతి కుమార్, పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, వినయ్ శర్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా దేవాలయంలో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికపై

ఉత్కంఠ!

ఎన్నికల బరిలో మొత్తం 19 మంది

- 12 జిల్లాల్లో అభ్యర్థుల విస్తృత ప్రచారం
- పోటీకి దూరంగా కాంగ్రెస్, బీఆర్ఎస్
- బీజేపీ అభ్యర్థికి మద్దతుగా రంగంలోకి అగ్రనేతలు
- ఈనెల 25న ప్రచారానికి తెర
- 27న బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్
- మార్చి 3న కౌంటింగ్.. 8న ఎన్నికల ప్రక్రియ పూర్తి
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఉత్కంఠ రేపుతోంది. ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రత్యక్షంగా పోటీ చేస్తుండగా అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ తమ అభ్యర్థులను బరిలోకి దించలేదు. ఇప్పటి వరకు ఎవరికీ మద్దతు కూడా ప్రకటించలేదు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో మొత్తం 19 మంది అభ్యర్థులు మిగిలారు. వీరిలో కొందరు ప్రచారానికి దూరంగా ఉండిపోగా మిగిలిన అభ్యర్థులంతా హోరాహోరీగా తలపడుతున్నారు. యూటీఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, బీజేపీ నుంచి పులి సరోత్తంరెడ్డి, టీపీఆర్టీయూ నుంచి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, పీఆర్టీయూ నుంచి నుంచి పింగిలి శ్రీపాల్ రెడ్డి, సీపీఎస్‌యూ నుంచి డాక్టర్ కొలిపాక వెంకటస్వామితో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ తదితరులు తలపడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఏడుగురు టీచర్ ఎమ్మెల్సీ రేసులో నిలిచారు.

12 జిల్లాలు.. 200 పోలింగ్ కేంద్రాలు

వరంగల్– ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ఈనెల 25తో ముగియనుంది. 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్నాయి. ఇందుకోసం యంత్రాంగం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఎన్నికలకు 3 ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 కొత్త జిల్లాల్లోని 191 మండలాల్లో 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 25, 797 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 5, 215 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా సిద్దిపేట జిల్లాలో 166 మంది మాత్రమే ఉన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం నల్లగొండ కలెక్టరేట్‌కు బ్యాలెట్ బాక్సులు తరలించనున్నారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మార్చి 8వ తేదీ నాటికి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తి కానుంది.

బీజేపీ అగ్రనేతల ప్రచారం..

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. బీజేపీ పోటీ చేస్తుండగా, అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రం ఎన్నికల్లో తమ అభ్యర్థులను బరిలోకి దించలేదు. 2019 ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీలు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ పీఆర్టీయూ అభ్యర్థిగా పోటీ చేసిన పూల రవీందర్‌కు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించింది. యూటీఎఫ్ అభ్యర్థికి సీపీఎంతోపాటు కాంగ్రెస్ కూడా పరోక్షంగా సహకరించింది. అయితే టీ పీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న హర్షవర్ధన్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల కాంగ్రెస్ శ్రేణులు కూడా ఆయనకు సపోర్ట్ చేస్తుండగా అధిష్టానం మాత్రం ఎవరికీ మద్దతివ్వలేదు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ జెండాలు లేకుండానే టీచర్ ఎమ్మెల్సీ పోరు జరుగుతోంది. ఇక బీజేపీ జెండాతో ఆ పార్టీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా పార్టీ అగ్రనేతలు రంగంలోకి దిగారు. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ తదితరులు అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలని క్యాంపెయిన్ చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

- మిత్రుడి కుమారుడి స్కూల్ ఫీజు రూ.10వేలు చెల్లించిన బాల్యమిత్రులు
- రూ.6వేలు రాయితీ ఇచ్చిన కరస్పాండెంట్

స్కూలు ఫీజు అందజేస్తున్న స్నేహితులు

అక్షర దర్బార్, కేసముద్రం: మండలంలోని ధన్నసరి గ్రామానికి చెందిన గోపాల వెంకటరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటరెడ్డి వైద్య ఖర్చుల కోసం బాల్యమిత్రులు 1994–95 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు విరాళాలు సేకరించి రూ.41వేలు అందజేశారు. ఈ క్రమంలో గుండెపోటుతో వెంకటరెడ్డి మృతి చెందాడు. మృతుడి కుమారుడు త్రివిక్ రెడ్డి కేసముద్రం విలేజ్ శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో ఐదో తరగతి చదువుతుండగా స్కూలు ఫీజు రూ.16వేలు చెల్లించాల్సి ఉంది. దీంతో విషయాన్ని కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కరస్పాండెంట్ స్కూల్ ఫీజులో రూ.6వేలు మినహాయించగా, మిగతా అమౌంట్ రూ.10వేలు స్నేహితులు శనివారం అందజేశారు. కార్యక్రమంలో 1994–95 బ్యాచ్ వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి మిడతనపల్లి ప్రకాష్, చిట్యాల వీరన్న, కొండబోయిన శ్రీనివాస్, యాసారపు సతీష్, దేశబోయిన సుధాకర్ ఉన్నారు.

నాగూర్ల పరామర్శ

అక్షర దర్బార్ ఆత్మకూర్ : చౌళ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోరే రామారావు ఇటీవల మృతి చెందారు. కాగా ఆయన కుటుంబాన్ని ఆరె కుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్ రావు శనివారం పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు మోర్తాల చందర్ రావు, ఆరె కుల సంఘ రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్ , జిల్లా నాయకులు సిరిసే చందర్ రావు, ఆరె సంఘం ఆత్మకూర్ మండల అధ్యక్షులు గువ్వాటి సాంబయ్య, ప్రధాన కార్యదర్శి లకిడే హరీష్, మాజీ ఎంపిటిసి అధరసాని చందర్ రావు, మాజీ సర్పంచ్ మోరే సాంబశివరావు , టీఆరెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మోరే మహేందర్, అరేంపి డాక్టర్ సోమేశ్వర్ రావు, అల్లాపురం మధుసూదనరావు, అదరసాని లాలాజీ, మోరే రాజేశ్వరావు, అరవింద్, రాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి

ఎస్ఐ శివ కృష్ణ

అక్షర దర్బార్, పరకాల : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని పరకాల ఎస్సై శివ కృష్ణ అన్నారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు శనివారం పట్టణ కేంద్రంలోని శారద విద్యాలయం, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్, చైతన్య, ఎస్ఆర్, డిజి బాలాజీ పాఠశాలలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పరకాల ఎస్ఐ శివకృష్ణ హాజరై పరీక్ష పేపర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శారద హై స్కూల్ చైర్మన్ మార్గ సత్యనారాయణ గౌడ్, ఎస్ ఆర్ డి జి ప్రిన్సిపల్ విజయ శ్రీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్ , బొజ్జ హేమంత్, బొచ్చు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శనివారం
22.02.2025
www.aksharadarbar.com
అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

ఎస్ఎల్‌బీసీలో 8 మంది గల్లంతు

- సొరంగంలో చిక్కుకున్న కార్మికులు
- శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ వద్ద భారీ ప్రమాదం
- ఘటనా స్థలాన్ని సందర్శించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందజేయాలని ఆదేశం

అక్షరదర్బార్, మహబాబ్‌నగర్: శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గంలో ప్రమాదం చోటు చేసుకుంది. నాగర్ కర్నూలు వద్ద సొరంగంలో ఏర్పాటు చేసిన రింగ్లు కిందపడటంతో పైకప్పు కూలి సొరంగంలో 8 మంది కార్మికులు చిక్కుకుపోయారు. వీరిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఘటనా స్థలికి చేరుకుని సహాయకచర్యలు పర్యవేక్షిస్తున్నారు. దోమలపెంట సమీపంలోని టన్నెల్‌లో ప్రమాదం జరగగా శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ 14వ కిలోమీటర్ వద్ద... సొరంగంలో.. 3 మీటర్ల మేర పైకప్పు కూలింది. దీంతో ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఉదయం షిఫ్ట్ లో సొరంగంలో పనులకు 50 మంది లోపలికి వెళ్లారు. ఒక్కొక్కరిగా 42 మంది సొరంగం నుంచి కార్మికులు బయటకు వచ్చారు. మరో 8 మంది సొరంగంలో చిక్కుకుపోవడంతో... వారిని బయటకు తీసుకువచ్చేందుకు రక్షణ చర్యలు చేపట్టారు. కూలీలు పంజాబ్, జమ్మూకశ్మీర్ , యూపీ వాసులుగా గుర్తించారు. సొరంగంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎడమవైపు సొరంగం వద్ద 4 రోజుల కిందటే మళ్లీ పనులు మొదలయ్యాయి.

బోల్టులు ఊడిపోవడంతోనే..

ప్రమాదవార్త తెలిసిన వెంటనే హుటాహుటిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు చేరుకున్నారు. టన్నెల్ దగ్గర పరిస్థితిని మంత్రి పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నకార్మికులను పరామర్శించారు. టన్నెల్ బురదలో 8 మంది కార్మికులు కూరుకుపోయారని మంత్రి తెలిపారు. గల్లంతైన కార్మికులు పంజాబ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ చెందిన వారని అన్నారు. బోల్టులు ఊడిపోవడంతో సిమెంట్ సెగ్మెంట్‌లు కూలాయని చెప్పారు. ఇప్పటి వరకు కార్మికుల ఆచూకీ దొరకలేదని అన్నారు. జనరేటర్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీ ఫోన్..

ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీ ఫోన్ చేశారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదంపై ప్రధాని ఆరా తీశారు. సొరంగంలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకున్నారని, వారిని కాపాడేందుకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టామని ప్రధానికి సీఎం రేవంత్ వివరించారు. సహాయక చర్యల కోసం వెంటనే ఎన్డీఆర్ఎఫ్ టీంను పంపిస్తామని సీఎంకు ప్రధాని మోడీ చెప్పారు. పూర్తిస్థాయి సహకారం అందించేందుకు కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధాని హామీ ఇచ్చారు..

హోరాహోరీ..!

నరేందర్‌రెడ్డి వర్సెస్ అంజిరెడ్డి

- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్, బీజేపీ గురి
- మరోమారు గెలిచి తీరాలన్న పట్టుదలతో హస్తం పార్టీ
- సర్వశక్తులూ ఒడ్డుతున్న కమలదళం
- పోటీకి దూరంగా బీఆర్ఎస్..
- 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నేతల విస్తృత ప్రచారం
- ఉత్కంఠ రేపుతున్న పోరు

అక్షరదర్బార్, కరీంనగర్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతుండటంతో ప్రచారం జోరు అందుకుంది. ఈ ఎన్నికను అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ నుంచి ఆల్‌ఫోర్స్ నరేందర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. పీసీసీ ఆయన గెలుపును సవాల్‌గా తీసుకుంది. పార్టీ సీనియర్లకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ నాయకత్వం పార్టీ శ్రేణులన్నింటినీ గ్రౌండ్‌లోకి దింపింది. బీజేపీ తరఫున అంజిరెడ్డి పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికకు బీఆర్ఎస్ దూరంగా ఉంది. రెండు ప్రధాన పార్టీల నేతలు, కార్యకర్తలు పట్టణాలు, గ్రామాల్లో ప్రతి ఓటరును కలుస్తూ తమ అభ్యర్థికే మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతున్నారు. దీనికితోడు సోషల్ మీడియా ద్వారా కూడా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. వాట్సాప్, ఫేస్బుక్ లలో పోస్టులతో కుమ్మేస్తున్నారు. ఓటర్లకు వాయిస్ మెసేజ్‌లు పంపిస్తున్నారు. ప్రధాన పార్టీలతో పాటు కొందరు ఇండిపెండెంట్ అభ్యర్థుల తరపున ఓటర్లకు ఫోన్లు చేసి అభ్యర్థిస్తున్నారు.

జోరు మీదున్న కాంగ్రెస్

నిజామాబాద్ – కరీంనగర్– మెదక్– ఆదిలాబాద్ ఎమ్మెల్సీ స్థానం నిలబెట్టుకోవడాన్ని కాంగ్రెస్ ఛాలెంజ్‌గా తీసుకుంది. ఇక్కడ పదేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడే కాంగ్రెస్ విజయం సాధించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్నందున తప్పనిసరిగా గెలిచి తీరాలని పట్టుదలతో ఉంది. ఏకంగా 15 జిల్లాలు 42 అసెంబ్లీ నియోజకవర్గాలు 271 మండలాల పరిధిలో విస్తరించిన ఈ నియోజకవర్గంలో 3.57 లక్షల మంది పట్టభద్రులు ఉన్నారు. టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ సొంత జిల్లా ఈ నియోకవర్గంలోనే ఉండడంతో లీడర్ల అంతా కలిసికట్టుగా పనిచేస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు త్వరలో జరగబోయే లోకల్ బాడీ ఎలక్షన్స్ పై ప్రభావం చూపనుండడంతో కిందిస్థాయి నుంచి శ్రేణులను ప్రచారంలోకి దించారు. ఆయా జిల్లాల్లో ముగ్గురు మంత్రులు, నలుగురు ఇన్చార్జ్ మంత్రులు, 23 మంది ఎమ్మెల్యేలను మోహరించారు. ఎమ్మెల్యేలు లేని చోట ఇన్చార్జిలను నియమించారు. యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ లీడర్లు చురుగ్గా ప్రచారంలో పాల్గొంటున్నారు. నరేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని గ్రాడ్యుయేట్లను కలిసి అభ్యర్థిస్తున్నారు. ఈక్రమంలోనే ఈనెల 24న కరీంనగర్‌లో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ నిర్వహించనుండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై ప్రసంగించనున్నారు.

ఓటమి భయంతో బీఆర్ఎస్ దూరం

పార్లమెంట్ ఎన్నికల తర్వాత జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ దూరంగా ఉండటం పార్టీ శ్రేణులను నిరుత్సాహపరుస్తున్నది. టీచర్ స్థానాలకు పోటీ చేయకపోయినా కనీసం గ్రాడ్యుయేట్ స్థానానికైనా పోటీ చేస్తే బాగుండేదన్న భావన పార్టీ ముఖ్య నేతల్లో నెలకొంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత జిల్లాలో మెజారిటీ క్యాడర్ కాంగ్రెస్‌లోకి వెళ్ళింది. మిగిలిన కేడర్ సైలెంట్ అయిపోయింది. ఇలాంటి సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తే తప్ప కేడర్లో మళ్లీ ఉత్సాహం వచ్చేదని బీఆర్ఎస్ లోని కొందరు నేతలు అంటున్నారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపాలైతే దాని ప్రభావం స్థానిక సంస్థలపై ఉంటుందని భావన ఆ పార్టీ పెద్దల్లో ఉన్నందునే పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత గత ఏడాది జరిగిన వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల్లోనూ ఆ పార్టీ ఓడిపోవడం కూడా ఇందుకు కారణమని చెప్తున్నారు.

ప్రత్యామ్నాయంపై బీజేపీ ఆశలు..

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్గా కాంగ్రెస్ కు తామె ప్రత్యామ్నాయంగా నిరూపించుకోవాలని ఆ పార్టీ ఉవ్విలూరుతున్నది. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండడంతో ఆ ఖాళీని ఆక్రమించుకునేందుకు బీజేపీ రంగంలోకి దిగింది. గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదునుపెడుతోంది. 2023లో జరిగిన అసెంబ్లీ, 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీచేసిన బీజేపీ గతంతో పోలిస్తే మెరుగైన స్థానాలు గెలుచుకుంది. అసెంబ్లీలో ప్రాతినిధ్యాన్ని ఒక్కస్థానం నుంచి ఎనిమిది స్థానాలకు పెంచుకున్న కమలం పార్టీ ఏకంగా 8 పార్లమెంటు స్థానాల్లో గెలిచి సత్తా చాటింది. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పట్టు నిలుపుకోవాలని, తద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయం కావాలని ప్రణాళికలు రచిస్తున్నది.

వందశాతం లెక్క పక్కా..

- పారదర్శకంగా బీసీ కుల గణన
- బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలో పడొద్దు
- అసెంబ్లీ తీర్మానం చేస్తే నా బాధ్యత పూర్తి
- బీసీ సంఘాల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

అక్షరదర్బార్, హైదరాబాద్: దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో బీసీ కుల గణన పారదర్శకంగా చేపట్టామని, కులగణన ప్రక్రియ నిర్వీర్యం చేసేలా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుట్ర పన్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కులగణనపై కోర్టుల్లో కేసులు వేసే ప్రమాదం ఉందని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మాటిచ్చారని తెలిపారు. బలహీన వర్గాలు ముందుకొచ్చి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయని చెప్పారు. మా నాయకుడు ఇచ్చిన మాటను నిలబెట్టాలని బీసీ కులగణన చేశామని తెలిపారు. ఇవాళ గాంధీభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బీసీ సంఘాలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన బీఆర్ఎస్, బీజేపీపై విరుచుకుపడ్డారు.

కేసీఆర్ కాకిలెక్కలు..

మాజీ సీఎం కేసీఆర్ ఒక్క రోజులో సర్వే చేసి కాకి లెక్కలు చెప్పారని అన్నారు. ఆ వివరాలు బయటకు చెప్పకుండా దాచి పెట్టుకున్నారన్నారు. రాజకీయాలకు ఆ వివరాలను కేసీఆర్ వినియోగించుకున్నారని.. కానీ తాము అలా చేయలేదని చెప్పారు. ప్లానింగ్ విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా పెట్టుకుని సర్వే చేశామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ చేసిన సమగ్ర సర్వే తప్పుడు సర్వే అని ఆరోపించారు. ఎస్సీల్లో 56 కులాలు ఉంటే 86 కులాలుగా సమగ్ర కుటుంబ సర్వేలో చూపించారని మండిపడ్డారు. తాము చేసిన సర్వేను కొందరు తప్పుపడుతున్నారని... ఎక్కడ తప్పు ఉందో చెప్పాలని అడిగారు. వారికి ఆ అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే చేశామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీసీ అని చెప్పుకుంటారని.. .2011లో కాంగ్రెస్ చేసిన బీసీ సర్వే లెక్కలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

ప్రశ్నిస్తారనే భయం..

కేంద్రమంత్రి బండి సంజయ్‌కు ప్రేమ ఉంటే ఆ లెక్కలు బయట పెట్టాలని కోరారు. బీసీలకు వాటా ఇవ్వాల్సి వస్తుందని ఆ సర్వే వివరాలు బయట పెట్టడం లేదని ధ్వజమెత్తారు. ప్రతీ రాష్ట్రంలో ఈ డిమాండ్ వస్తే దేశం మొత్తం చేయాల్సి వస్తుందని అన్నారు. బీసీల లెక్క తేలితే బీజేపీలో అధికారం చెలాయించే ఒకటి రెండు సామాజిక వర్గాలకు ఇబ్బంది అవుతుందని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఇప్పటి వరకు వారి వివరాలు ఎందుకు నమోదు చేసుకోలేదని ప్రశ్నించారు. 50శాతం ఉన్న ప్రజలు, అర శాతం ఉన్న వాళ్లను ప్రశ్నిస్తారని వాళ్లకు భయపట్టుకుందని విమర్శించారు. అందుకే బీసీల సర్వేకు వారు సహకరించడం లేదని అన్నారు. కేసీఆర్ నాలుగు కేటగిరీల్లో లెక్కలు తీస్తే తాము ఐదు కేటగిరీల్లో వివరాలు తీసుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో తీర్మాణంతో తన బాధ్యత ముగుస్తుందని సీఎం చెప్పారు.

గూడూరు ఏజెన్సీ గ్రామమే

న్యాయ పోరాటానికి మేము సిద్ధం : తుడుందెబ్బ

అక్షర దర్బార్, మహబూబాబాద్ : గూడూరు మండలం ముమ్మాటికి ఏజెన్సీ గ్రామమే అని తుడుందెబ్బ నాయకులు స్పష్టం చేశారు. శనివారం మండల కేంద్రంలోని కొమరం భీం కమ్యూనిటీ హాల్లో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు లింగాల కిరణ్ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ హాజరై మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి గూడూరు మండలం షెడ్యూల్ ప్రాంతంగానే ఉందని అన్నారు. గూడూరు గ్రామాన్ని షెడ్యూల్ గ్రామం కాదని గిరిజనేతర్లు అనడంలో అర్థం లేదని మండిపడ్డారు. కొంతమంది కావాలని వారి స్వార్థ ప్రయోజనాల కోసం మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం

మాట్లాడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

చేశారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు బొల్లి సారయ్య, ఉపాధ్యక్షులు పడగ మంగయ్య దొర, ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు దారం సాంబయ్య దొర, గూడూరు మండల అధ్యక్షులు కొట్టం వజ్జయ్య, మండల కార్యదర్శి ఈసం మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ దొందు దొందే..

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీలది లోపాయికారి ఒప్పందం
- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్,శాయంపేట : బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే అని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు లోపాయికారి ఒప్పందంతో పని చేస్తున్నాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆరోపించారు. శనివారం శాయంపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రంగా వంచించిందని ఆరోపించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. పాత, కొత్త నాయకత్వం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అని తేడా లేకుండా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పరకాల మార్కెట్ మాజీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్ల చక్రపాణి, మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాష్ రెడ్డి, ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్, నాయకులు దుబాసి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆవాసం కోసమే ఆరాటమా?

- మహదేవపూర్ మండల అటవీ ప్రాంతంలో తిరుగుతున్న పులి
- ఆచూకీ కోసం అటవీ శాఖ అధికారుల పాట్లు
- ఒక చోట నుండీ మరో చోటుకి అవాసాన్ని మార్చుతున్న పులి
- భయాందోళనకు గురవుతున్న స్థానిక ప్రజలు
- పులి గురించి ఆసక్తికర విషయాలు తెలుసుకుందాం

అక్షర దర్బార్, కాటారం :జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, మహదేవపూర్ మండలాల అటవీ ప్రాంతంలో గత పదకొండు రోజులుగా పులి హైరానా సృష్టిస్తోంది.తన ఆచూకి కోసం అటవీశాఖ అధికారులను ముప్పు తిప్పలు పెడుతోంది.తన సంచరాన్ని తెలుపుతూ స్థానిక ప్రజలని భయాందోళకు గురి చేస్తోంది.ఈ నేపథ్యంలో పులి తన నూతన ఆవాసం ఏర్పాటు చేసుకోవడానికే మహదేవపూర్, కాటారం అడవులలో సంచరిస్తుందా అనే అనుమానం కలుగుతుంది.ఇటీవల కాలంలో పక్కనున్న కవ్వాల అభయారణ్యం, తడోబాభయారణ్యంలో పులుల జనాభా పెరుగుతుండడంతో పులి తన నూతన ఆవాసం కోసం ఈ అడవులలోకి వచ్చిందా అనే అనుమానం కలుగుతుంది. పులి అనేది ఏకాంత జీవి తను ఏకాంతంగా ఉండడానికి ఇష్టపడుతుంది. పులులు తాను ఒక ప్రాదేశిక స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. ఈ ప్రాదేశిక స్థావరం కనీసం 20 చదరపు కిలోమీటర్ల పరిధి నుండి 40 చదరపు కిలోమీటర్ల పరిధి వరకు ఉంటుంది.ఈ ప్రాదేశిక ఆవరణంలోనే పులి తను పెట్రోలింగ్ చేస్తూ తన మూత్రము,మరియు తన పాద ముద్రలతో హద్దులను నిర్ణయించుకుంటుంది. ఆవాసం ఏర్పాటు చేసుకోవాలంటే ముఖ్యంగా దట్టమైన అడవి,తగిన ఆహారం, నీటి వసతి ఉన్న ప్రదేశాన్ని చూసుకొని ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయి.

పులి అకస్మాత్తుగా ఎదురైతే ...?

మనిషికి పులి అంటే ఎంత భయమో పులికి మనిషి అంటే అంతే భయం ఉంటుంది. మనిషి కంటే పులి చూపు దాదాపు 6 రెట్లు ఎక్కువగా ఉంటుంది. పులిని మనం చూసే లోపల అది మనల్ని చూసి వేరే వైపుకు వెళ్ళిపోతుంది.ఒకవేళ పులి అకస్మాత్తుగా ఎదురైతే పులి కళ్ళలోకి కళ్ళు పెట్టి చూస్తూ అక్కడే కదలకుండా నిలబడి ఉండాలి .పులి కొంత దూరం వెళ్ళాక దగ్గరలో ఉన్న చెట్టు ఎక్కాలి.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..!

మనం అడవిలోకి వెళ్లేటప్పుడు మనతో పాటుగా చేతిలో కర్రను పైకి పట్టుకొని అడవిలో నడుచుకుంటూ వెళ్లాలి. ఎందుకంటే పులి తనకంటే ఎత్తైన వస్తువుగా భావించి మనుషుల మీద దాడి చేసే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది.. పులి ఆహారపు అలవాట్లలో మనిషి లేడు కనుక మనిషి పై దాడి చేసే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. మనం అడవులలో ఉన్నప్పుడు కూర్చొని ఉండడం కానీ ,వంగి ఉండడం కానీ ఎట్టి పరిస్థితులలో చేయకూడదు ఎందుకంటే మనం వంగి ఉండడం వల్ల గాని కూర్చొని ఉండడం వల్ల గాని ఉండడం వల్ల అది మనిషిని నాలుగు కాళ్ల జంతువుగా భావించి దాడి చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది.మనం అడవులలో సంచరించేటప్పుడు మెడకు వెనుక వైపు ఫేస్ మాస్కు పెట్టుకొని సంచరించాలి..

సంభోగం కోసమే సంచారమా..?

పులి సంభోగం అనేది దాదాపుగా జులై నుండి సెప్టెంబర్ కాలంలోనే పాల్గొంటాయి. ప్రస్తుతం మన అడవుల్లో ఆడ పులిసంచరిస్తున్నట్లుగా ఎలాంటి ఆనవాళ్లు లేవు కాబట్టి మేటింగ్ కోసమే ఈ పులి వచ్చినట్టుగా చెప్పలేము.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

అక్షర దర్బార్, రేగొండ: మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీహెచ్సీ వైద్యలు హిమబిందు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధించారు. డీఈవోగా వైష్ణవి, ఎంఈఓగా మణికంఠ, ప్రిన్సిపల్ గా జయంత్, వైస్ ప్రిన్సిపాల్ గా హర్షిత వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సర్వ రజిన్ కుమార్, ఉపాధ్యాయులు రమేష్, రాజు, రవీందర్, తిరుపతి, దేవేందర్, శ్రీనివాస్, మధు, సుమన్, ఓంకార్, ఐలయ్య, మాలత, చైతన్య, శశాంక, ఉజ్వల, శిరోమణి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి : ఆర్డీవో

అక్షర దర్బార్, పరకాల : పరకాల రెవెన్యూ డివిజన్ అధికారి డాక్టర్ నారాయణ, పరకాల ఏసీపి సతీష్ బాబు ఆధ్వర్యంలో వరంగల్– ఖమ్మం– నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక సమావేశం శనివారం పరకాల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : aksharadarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915